శుక్రవారం 28-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 378, పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## బుల్లెట్ రైళ్లు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం..!

### ఉభయసభల ప్రసంగంలో రాష్ట్రపతి



ముందడుగు జాతీయం:

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేడు పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో బుల్లెట్ రైల్‌పై ప్రస్తావించారు. "నా ప్రభుత్వం దేశవ్యాప్తంగా బుల్లెట్ రైల్ కారిడార్లను విస్తరించడానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేపట్టనుంది. తూర్పు, దక్షిణ, ఉత్తర ప్రాంతాల్లో ఇవి జరగనున్నాయి" అని పేర్కొన్నారు. సరికొత్త భారత్ ముఖ చిత్రాన్ని అత్యాధునిక మౌలిక సదుపాయాలు మార్చేస్తాయని తెలిపారు. ఇప్పటికే మొదలైన అహ్మదాబాద్ - ముంబయి హైస్పీడ్ రైలు వ్యవస్థ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. దాదాపు 508 కిలోమీటర్ల పొడవుతో నిర్మిస్తున్న ఈ కారిడార్ దేశంలోనే మొదటిది. సాధారణంగా మిగతా 2లో




## నీట్ అవకతవకలపై సుప్రీం నోటీసులు

- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి ఆదేశాలు
- జులై 8వ తేదీలోగా సమాధానం ఇవ్వాలి

ముందడుగు జాతీయం:

భారత సుప్రీంకోర్టు నీట్-యూజీ 2024లో అవకతవకలపై ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)కు గురువారం నోటీసులు జారీ చేసింది. జులై 8వ తేదీలోగా దీనికి తగిన సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. నీట్-యూజీ 2024పై వచ్చిన మిగిలిన పిటిషన్లతో కలిపి అదేరోజు విచారణ చేపడతామని పేర్కొంది. నీట్-యూజీ 2024 మార్కుల గణనలో ఇష్టారీతిన వ్యవహరించారంటూ పిటిషన్‌ను ఓ లెర్నింగ్ యాప్ దాఖలు చేసింది. మెడికల్ పరీక్షకు హాజరైన చాలామంది ఓఎంఆర్ షీట్లను పొందలేదని పేర్కొంది. దీనిపై నేడు మిగతా 2లో



బీహార్‌లో కూలిపోయిన మరో వంతెన

వివరాలు 2లో



వీధి శునకం కోసం రతన్ టాటా అభ్యర్థన

వివరాలు 3లో



కాఫీ ప్రాణాలను కాపాడుతుంది

వివరాలు 3లో



25ఏళ్లు దాటితే ఈ పరీక్షలు తప్పనిసరి

వివరాలు 4లో

## నీట్ పేపర్ లీక్ కేసులో మొదలైన అరెస్టులు

### కేసు దర్యాప్తును వేగం చేసిన సీబీఐ



ముందడుగు జాతీయం:

నీట్-యూజీ 2024 కేసు దర్యాప్తును సీబీఐ వేగవంతం చేసింది. దీనికి సంబంధించి అరెస్టులు మొదలుపెట్టింది. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న మనీశ్ ప్రకాశ్, అశుతోష్‌ను బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకొంది. ఈ కేసులో లీకైన పేపర్‌ను పొందిన విద్యార్థులను మనీశ్ తన కారులోనే తరలించినట్లు మిగతా 2లో

## రాజదండం భారత్‌కు గర్వకారణం

- చరిత్ర పట్ల ఏ మాత్రం గౌరవం లేదు
- యోగి ఎక్స్ (ట్విటర్) వేదికగా ఆరోపణ



ముందడుగు జాతీయం:

పార్లమెంట్లో స్పీకర్ కుర్చీ పక్కన రాజదండాన్ని ఏర్పాటు చేయడంపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆర్‌కే చౌధరి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీనిపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. "సమాజ్‌వాదీ పార్టీ మన దేశ చరిత్ర, తమిళ సంస్కృతిని అగౌరవపరిచింది. ఇండియా కూటమికి భారతీయ చరిత్ర పట్ల ఏ మాత్రం గౌరవం లేదు. ఆ నేతలు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా మిగతా 2లో

ముందడుగు
శుక్రవారం, 28-6-2024, హైదరాబాద్

## బుల్లెట్ రైళ్లు సాధ్యాసాధ్యాలపై
# అధ్యయనం..!

మొదటిపేజీ తరువాయి

బుల్లెట్ రైళ్లు గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఈ లెక్కన రెండు నగరాల మధ్య ప్రయాణం కేవలం 2 గంటల 7 నిమిషాల్లో ఇది పూర్తి చేస్తుంది. ఈ క్రమంలో సూరత్, వడోదరలో దీనికి స్టాప్‌లు ఉన్నాయి.

ది నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పోరేషన్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టులో తొలిఫేజ్‌లో సూరత్-బిల్మోర మధ్య నిర్మాణాన్ని ఆగస్టు 2026 నాటికి పూర్తి చేయనున్నారు. తొలిదశలో ఆరు రైళ్లను జపాన్ నుంచి కొనుగోలు చేస్తారు. ఈ మొత్తం ప్రాజెక్టు ఉన్న మార్గంలో విక్రోలీ వద్ద 21 కిలోమీటర్ల మేర హైస్పీడ్ రైలు మార్గం భూగర్భ సొరంగంలోనే ఉంటుంది. ఇందులో ఏడు కిలోమీటర్ల మార్గం సముద్రగర్భంలో సాగుతుంది. పర్వతాలను తొలుచుకుంటూ అయిదు కిలోమీటర్ల మేర సొరంగ మార్గం నిర్మిస్తున్నారు. గుజరాత్‌లో ఎనిమిది, మహారాష్ట్రలో నాలుగు చొప్పున మొత్తం 12 రైల్వేస్టేషన్లు రానున్నాయి. బాంద్రాకుర్లా కాంప్లెక్సు వద్ద దాదాపు 10 అంతస్తుల లోతైన నిర్మాణం ఒకటి రానుంది. థాణే-వాపీ మధ్య ఎత్తయిన కారిడార్ పనులూ వేగంగా సాగుతున్నాయి.

# బీహార్‌లో కూలిపోయిన మరో వంతెన

## రూ. 12 కోట్ల వంతెన సెకన్లలో కూలిపోయింది ▪ వారంలో కూలిన నాలుగవ బ్రిడ్జి

ముందడుగు బీహార్:

బీహార్‌లోని కిషన్‌గంజ్ జిల్లాలో తాజాగా మరో వంతెన కూలిపోయింది. వారంలో ఇది నాలుగవ వంతెన. కంకై నదిపై ఉన్న ఉపనదిపై 70 మీటర్ల వంతెన కూలిపోయింది. ఇది బహదుర్‌గంజ్ మరియు దిఘల్‌బ్యాంక్ బ్లాక్‌లను కలుపుతుంది. ఇది కూలిపోవడంతో రెండు పట్టణాల మధ్య కనెక్టివిటీ దెబ్బతింది. ఇదిలా ఉంటే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. సంఘటన గురించి సమాచారం అందుకున్న బహదుర్‌గంజ్ పోలీస్ స్టేషన్ చీఫ్ అభినవ్ పరాసర్ తన బృందంతో సంఘటనా స్థలానికి చేరుకుని.. వెంటనే ఇరువైపులా బారికేడ్ చేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దాదాపు ఆరేళ్ల క్రితం ఈ వంతెనను నిర్మించినట్లు స్థానికులు తెలిపారు. రోడ్డు శాఖ అధికారులు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జిల్లా మేజిస్ట్రేట్ తుషార్ సింగ్లా మాట్లాడుతూ.. కంకై నదిని మహానంద నదికి కలిపే చిన్న ఉపనదిపై 2011లో వంతెనను నిర్మించారని తెలిపారు. నేపాల్‌లోని పరీవాహక ప్రాంతంలో భారీ వర్షా లు కురుస్తుండటంతో నీటి మట్టం ఒక్కసారిగా పెరిగిందన్నారు. భారీ ప్రవాహానికి వంతెన స్తంభాలలో ఒకటి తట్టుకోలేకపోయిందని పేర్కొన్నారు. గత వారం సివాన్, అరారియా జిల్లాల్లో మూడు వంతెనలు కూలిన సంఘటనలు అందరికీ తెలిసిందే. జూన్ 19న బీహార్‌లోని అరారియా జిల్లాలో బక్రా నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన ప్రారంభానికి ముందే కూలిపోయింది. రూ. 12 కోట్లతో నిర్మించిన వంతెన సెకన్లలో కూలిపోయింది. స్పాట్ నుంచి వీడియోలు వైరల్ అయ్యాయి. భారీ కాంక్రీటు భాగాలు కొట్టుకుపోతున్నట్లు కనబడ్డాయి. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంతో రాష్ట్రంలో ప్రజాపనుల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## నీట్ అవకతవకలపై
# సుప్రీం నోటీసులు

మొదటిపేజీ తరువాయి

జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీ బెంచ్ నేడు వాదనలను వినింది. ''ఓఎంఆర్ షీట్లు ఇవ్వడానికి ఏమైనా టైమ్‌లైన్‌ను మీరు పెట్టుకొన్నారేమో తెలియజేయండి. దీనిపై ఎన్‌టీఏను స్పందించనీయండి'' అని బెంచ్ పేర్కొంది. సంబంధిత పార్టీలు ఈ అంశంపై జులై 8వ తేదీ లోగా వివరణలు పంపాలని ఆదేశించింది. అదే సమయంలో కోచింగ్ సెంటర్లు పిటిషన్లు దాఖలు చేయడాన్ని కూడా న్యాయస్థానం ప్రశ్నించింది. ''ఇది కోచింగ్ సెంటర్ల వైపు నుంచి వచ్చిన 32వ పిటిషన్. ఇందులో మీ ప్రాథమిక హక్కులకు ఏం ఉల్లంఘన జరిగింది..? ఈ అంశంలో వారు పోషించడానికి ఏ పాత్ర కనిపించడం లేదు. చెప్పిన సేవలు అందించడంతోనే వారి పాత్ర ముగుస్తుంది. కేంద్రం చేయాల్సిన పనులను వారు చూడాల్సిన అవసరం లేదు'' అని పేర్కొంది. ఓవైపు సుప్రీంలో విచారణ జరుగుతుండగా.. మరోవైపు సీబీఐ దర్యాప్తూ జోరందుకుంది. నీట్ లీకులకు సంబంధించిన పలు అనుబంధ కేసులను పరిశీలిస్తోంది. ఈ కేసులు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఉన్నాయి. ఇప్పటికే ఈ పరీక్షలో అవకతవకలకు సంబంధించి పలువురిని అరెస్టు చేశారు.

# నిత్య పెళ్లి కూతురికి హెచ్ఐవీ

## ఆమె భర్తల కోసం పోలీసుల గాలింపు



ముందడుగు జాతీయం:

ఒక మహిళ దొంగ పెళ్లి చేసుకుని అర్ధరాత్రి నగలు, నగదుతో పరారవుతుంది. పెండ్లి కొడుకులను నమ్మించి మోసం చేసిన నిత్య పెళ్లి కూతురికి హెచ్ఐవీ పాజిటివ్ నిర్ధారణ అయింది. వెంటనే అధికారులు ఆమెను గతంలో పెండ్లి చేసుకున్న పెండ్లి కొడుకుల కోసం వేట ప్రారంభించారు. ఉత్తరాఖండ్‌లోని యూఎస్ నగర్ జిల్లాకు చెందిన 20 ఏండ్ల మహిళ యూపీ, ఉత్తరాఖండ్‌లలో పెళ్లి పేరుతో పలువురిని మోసగించింది. మే 6న యూపీ పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి ముజఫర్‌నగర్ జైలుకు తరలించారు. అక్కడ ఆమెకు వైద్య పరీక్షలు చేయగా, హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.. ఆమె ఆ వ్యాధిని గతంలో ఎంతమందికి వ్యాపింపచేసిందోనని పాత పెండ్లి కొడుకుల కోసం యూపీ పోలీసులు వెతుకుతున్నారు.

# నీట్ పేపర్ లీక్ కేసులో మొదలైన అరెస్టులు


మొదటిపేజీ తరువాయి

గుర్తించారు. వీరిలో రెండు డజన్ల మందికి అతడే ఒక రూమ్ కూడా బుక్ చేసినట్లు తెలుస్తోంది. ఇక రెండో నిందితుడైన అశుతోష్ పేపర్ లీక్‌లో భాగస్వాములైన విద్యార్థులకు తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించాడు. ఇప్పటికే పేపర్ లీక్‌కు సంబంధించి సీబీఐ క్రిమినల్ కేసు నమోదు చేసింది. దీంతోపాటు బిహార్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలు నమోదుచేసిన అభియోగాలను కూడా తమకు బదలాయించాలని నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే గుజరాత్‌లోని గోద్రా తాలుకా పోలీస్‌స్టేషన్‌లో మాల్‌ప్రాక్టీస్‌పై ఓ ఎఫ్ఐఆర్ నమోదైంది. సీబీఐ మొత్తం ఈ వ్యవహారంలో ఆరు కేసులను దర్యాప్తు చేస్తోంది. నీట్-యూజీ 2024 పరీక్షను దేశవ్యాప్తంగా మే 5వ తేదీన నిర్వహించింది. దీనికి 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పేపర్ బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లో లీకైనట్లు ఇటీవల కాలంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మధ్యలోనే జూన్ 4న ఎన్‌టీఏ ఫలితాలు ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. దీంతో కేంద్రం కూడా ఈ వ్యవహారంపై దృష్టి సారించింది.

# రాజదండం భారత్‌కు గర్వకారణం

మొదటిపేజీ తరువాయి

ఖండిస్తున్నా. తమిళ సంస్కృతిపై కూటమి నేతలకు ఎంత ద్వేషముందో ఈ వ్యాఖ్యల ద్వారా అవగతం అవుతోంది. 'రాజదండం' భారత్‌కు గర్వకారణం. ఈ విషయాన్ని వారు అర్థం చేసుకోలేకపోతున్నారు'' అని యోగి 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ఆరోపించారు. ఎస్పీకి చెందిన ఎంపీ ఆర్‌కే చౌధరి రాచరికానికి ప్రతీక సెంగోల్‌ను పార్లమెంట్‌లో పెట్టడాన్ని ప్రశ్నించారు. ''రాజదండాన్ని సభ నుంచి తొలగించాల్సిన అవసరం ఉంది'' అని వ్యాఖ్యానించారు. దీనికి ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ మద్దతిచ్చారు. దీనిపై తాజాగా స్పందించిన యోగి ఆదిత్యనాథ్ ప్రతిపక్షాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.




ముందడుగు
శుక్రవారం, 28-6-2024, హైదరాబాద్

# వీధి శునకం కోసం రతన్ టాటా అభ్యర్థన

## శునకానికి రక్తదాత కావాలని వేడుకోలు





ముందడుగు జాతీయం: ప్రపంచ బిలియనీర్లలో ఒకరైనా ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. గొప్ప మనసున్న టాటా ఎంతోమందికి సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అలాంటి ఆయన ముంబయి వాసులను సహాయం చేయమని కోరారు. ఓ వీధి శునకం ప్రాణాలు కాపాడమంటూ అభ్యర్థించారు. సోషల్ మీడియాలో టాటా పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. రతన్ టాటాకు మూగ జీవాలంటే ఎంత ప్రేమో మనందరికీ సుపరిచితమే. జంతువుల కోసం ఓ ఆస్పత్రిని కూడా నిర్మించారు. అయితే.. ఆనారోగ్యంతో బాధపడుతున్న ఏడు నెలల వీధి శునకానికి సిబ్బంది ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయినా దాని ఆరోగ్యం మెరుగుపడలేదు. అది రక్తహీనతతో పాటు మరికొన్ని సమస్యలతో బాధపడుతున్నట్లు పరీక్షల్లో తేలింది. ఆ మూగజీవి పరిస్థితిపై టాటా ఆందోళన వ్యక్తంచేశారు. దాన్ని కాపాడేందుకు సాయం చేయాలని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ముంబయివాసులను కోరారు. ఏడు నెలల శునకం మా ఆస్పత్రిలో చేరింది. అది ఎనిమియాతో బాధ పడుతోంది. ఆ మూగజీవాన్ని కాపాడేందుకు మా సిబ్బంది ఎంతో శ్రమిస్తోంది. కానీ.. చికిత్స కోసం శునకానికి దాత రక్తం అవసరమైంది. ముంబయి వాసులారా దయచేసి సాయం చేయండి. మీ వద్ద పూర్తి ఆరోగ్యంతో ఉన్న శునకం నుంచి రక్తాన్ని దానం చేయండి. మీరు సాయం చేస్తారని ఆశిస్తున్నా," అని రతన్‌టాటా కోరారు. బాధిత శునకం ఫొటోను షేర్ చేసిన ఆయన.. దాతకు ఉండాల్సిన అర్హతలను తెలిపారు.

# సర్ అన్నందుకు విమానం దింపేశారు

## సోషల్ మీడియా ద్వారా మహిళ ఆవేదన




ముందడుగు జాతీయం విమానంలోని మహిళా సిబ్బందిని పొరపాటున 'సర్' అన్నందుకు విమానం నుంచి దించేశారని ఒక మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో చోటుచేసుకుంది. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఆస్టిన్ బయలుదేరేందుకు విమానం సిద్ధమైంది. టెక్సాస్‌కు చెందిన జెన్నా లాంగోరియా తన కుమారుడు, తల్లితో విమానం ఎక్కే సమయంలో సిబ్బంది బోర్డింగ్ పాస్‌ను అందించారు. దీంతో మహిళా అటెండెంట్‌ను పొరపాటుగా పురుషునిగా భావించి.. 'థాంక్యూ సర్' అని తెలిపింది. దీంతో ఆమె ఆగ్రహానికి గురైంది. ప్రయాణికురాలి తల్లిని, బిడ్డను లోనికి వెళ్లకుండా ఆపేసింది. అదే సమయంలో జెన్నా మరో మేల్ ఫ్లైట్ అటెండెంట్ సాయం కోరింది. తన తల్లి, కుమారుడిని ఆయన గేట్ వద్ద ఆపేశారని ఫిర్యాదు చేసింది. దీంతో ఆ మేల్ ఫ్లైట్ అటెండెంట్.. ఆ సిబ్బంది 'ఆయన' కాదు 'ఆమె' అని బదులిచ్చారు. తన తప్పును తెలుసుకుని ఆ మహిళా సిబ్బందికి క్షమాపణలు చెప్పేందుకు ప్రయత్నించినా వినిపించుకోకపోగా.. విమానం నుంచి దింపేశారని సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# కాఫీ ప్రాణాలను కాపాడుతుంది

- 60శాతం జీవించే అవకాశాన్ని ఇస్తోంది
- తాజా అధ్యయనంలో వెల్లడి



ముందడుగు జాతీయం: చాలా మంది రిలీఫ్ కోసం కాఫీ తాగుతుంటారు. మరికొందరు అది బ్యాడ్ హ్యాబిట్ అని ఫీల్ అయిపోతారు. కానీ నిజానికి కాఫీ తాగడమే ప్రాణాలను కాపాడుతుందని చెప్తుంది తాజా అధ్యయనం. 13ఏళ్లుగా 10000 మంది కంటే ఎక్కువ మందిపై నిర్వహించిన ఈ స్టడీ.. కాఫీ తాగని వారితో పోలిస్తే తాగే వారు జీవించే అవకాశం 60 శాతం ఎక్కువగా ఉందని తెలిపింది. అంటే రోజూ కాఫీ తాగడం వల్ల మరణాల ముప్పు 60 శాతం తగ్గుతుందని వెల్లడించింది.

చలనం లేకుండా గంటల కొద్ది కూర్చోవడం పలు అనారోగ్య ప్రమాదాలతో ముడిపడి ఉందని ఇప్పటికే పలు అధ్యయనాలు రుజువు చేశాయి. కాగా అలాంటి హెల్త్ రిస్క్ నుంచి కాఫీ కాపాడుతుందని తాజా అధ్యయనం వివరిస్తుంది. కాఫీలో కెఫిన్, పాలీఫెనాల్స్ వంటి యాంటీ ఇన్ఫ్లమేటరీ కాంపౌండ్స్.. మంటను తీవ్రతరం చేసే జీర్ణక్రియ సమస్యను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదం నుంచి కాపాడుతాయి. అయితే చనిపోయే ప్రమాదాన్ని తగ్గించడానికి శరీరంలో కాఫీ ఎలా పనిచేస్తుందో ఇప్పటికీ అస్పష్టంగా ఉండగా .. దీనిపై మరింత పరిశోధన జరగాల్సి ఉంది. కాగా ఇంతకు ముందు చైనాలోని సూచౌ యూనివర్శిటీ మెడికల్ కాలేజీలోని స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిశోధకులు రోజూ ఆరు గంటలు కూర్చుని కాఫీ తాగని వారితో పోలిస్తే తాగేవారికి 24 శాతం తక్కువ మరణ ప్రమాదం ఉందని కనుగొన్నారు.

# నాకు సీఎం పదవి పెద్ద విషయం కాదు

- ప్రజలు అనూహ్యంగా మోసపోయారు
- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దారి తప్పింది
- తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్



ముందడుగు తెలంగాణ తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సీఎం పదవి అనేది పెద్ద విషయం కాదు అని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పునరుద్ఘాటించారు. తనను కలిసేందుకు ఎర్రవెల్లి నివాసానికి వందలాదిగా తరలివచ్చిన ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. "తెలంగాణ సాధించేనాటికి మనది సమైక్యపాలనలో దిక్కు మొక్కు లేని పరిస్థితి. సాగునీరు తాగునీరు కరెంటు వంటి అనేక కీలక వసతులను కల్పించుకున్నాం. తీర్చిదిద్దుకున్నాం. పదేండ్ల అనతికాలంలోనే తెలంగాణలో అద్భుతమైన ప్రగతిని సాధించుకున్నాం. ఇటువంటి కీలక సమయంలో వచ్చిన ఎన్నికల్లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. కొన్ని కొన్ని సార్లు ఇట్లాంటి తమాషాలు జరుగుతుంటాయని చరిత్రలోకి వెళితే అర్థమౌద్ది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు అనూహ్యంగా మోసపోయారు. "పాలిచ్చే బర్రెను వొదిలి దున్నపోతును తెచ్చుకున్నట్టు అయింది" అని పల్లెల్లో ప్రజలు బాధపడుతున్నారు" అని కేసీఆర్ వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగించిన అనేక పథకాలు తమకు అందట్లేవని ప్రజలు ఆందోళన చెందుతున్నారని కేసీఆర్ అన్నారు. సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, రైతు బంధు అందట్లేవన్నారు. తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా సరిగా లేదన్నారు. ఇవన్నీ ప్రజల మనసుల్లో రికార్డ్ అవుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి దరికి తెచ్చిన తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో దారి తప్పిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఎటువంటి ఆందోళన చెందవద్దని కార్యకర్తలకు కేసీఆర్ భరోసా ఇచ్చారు.

ముందడుగు
శుక్రవారం, 28-6-2024, హైదరాబాద్

ఇండియన్ టెక్ ఎంఎస్ఎంఈల కోసం

# మెటా శ్వేత పత్రం




ముందడుగు హైదరాబాద్:
టెక్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు సాధికారత కల్పించేందుకు కట్టుబడిన మెటా, భారతదేశంలోని టెక్ ఎంఎస్ఎంఈలు ఏఐను అలవర్చుకునే ప్రయాణపు ప్రస్తుత స్థితిని గుర్తించేందుకు నాస్కామ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవం సందర్భంగా, మెటా మద్దతుతో నాస్కామ్, 'ఎంపవర్లింగ్ ఇండియాస్ గ్రోత్: టెక్-ఎనేబుల్డ్ ఎంఎస్ఎంఈలకు ఏఐ సామర్థ్యాలను అన్‌లాక్ చేయడం" అనే శీర్షికతో ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. ఎంఎస్ఎంఈల కోసం ఏఐ అవగాహన, సామర్థ్యాన్ని పెంపొందించడం, సవాళ్లు, అందుబాటులో ఉన్న పరిష్కారాలను అర్థం చేసుకోవడం, ఉత్పాదకత మరియు వ్యాపార వృద్ధిని మెరుగుపరచడానికి ఏఐ సాంకేతికతలను స్వీకరించేందుకు ఈ ఏడాది ప్రారంభంలో, నాస్కామ్, మెటా 'ఎంఎస్ఎంఈల కోసం ఏఐ అందుబాటు' కార్యక్రమాన్ని ప్రారంభించాయి. దేశంలోని ఐదు నగరాలు గురుగ్రామ్, బెంగుళూరు, పుణె, ముంబయి, హైదరాబాద్‌లలోని ఎంఎస్ఎంఈల కోసం దీన్ని నిర్వహించగా- వీటిలో 300 కన్నా ఎక్కువ ఎంఎస్ఎంఈలు శ్వేతపత్రంలోని ఇన్‌పుట్‌ల ఆధారంగా హాజరయ్యారు.

# స్కూలు వ్యాన్‌ను వేగంగా ఢీ కొట్టిన కారు

## స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థులు



ముందడుగు హన్మకొండ:
హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కమలాపురం నుండి హుజరాబాద్ రోడ్డు మార్గంలో వెళుతున్న ఏకశిలా పాఠశాల వ్యాను కన్నూరు గ్రామానికి వెళ్లే క్రమంలో ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్ వద్ద యూటర్న్ చేసుకుంటుండగా అటు హుజురాబాద్ వైపుగా వెళ్లే షిఫ్ట్ డిజైర్ కారు అతివేగంగా స్కూల్ వ్యాన్ ను ఢీ కొట్టింది. స్కూల్ వ్యాను మరింత వేగంగా బోల్తా పడడంతో విద్యార్థులకు భయభ్రాంతులకు గురయ్యారు. క్రేయిన్ సాయంతో కారు ను మరియు స్కూల్ వ్యాన్ ను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశామని సీఐ హరికృష్ణ తెలిపారు.

# 25 ఏళ్లు దాటితే ఈ పరీక్షలు తప్పనిసరి

## ప్రతి సంవత్సరం 7 టెస్టులు అవసరం ▪ జీవితాంతం హ్యాపీగా గడపొచ్చు

ముందడుగు ఆరోగ్యం:
ప్రస్తుత సమాజంలో మనిషి ఆరోగ్యం ఎప్పుడు, ఏలా ఉంటుందో అర్థం కానీ పరిస్థితి నెలకొంది. ఆరోగ్యంపై ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. ప్రస్తుతం మారిన జీవన శైలి, అనారోగ్యకరమైన ఆహారం తినే విధానం వల్ల ప్రతి క్షణం రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఈ కోణంలోమీరు ఎప్పటికప్పుడు కొన్ని పరీక్షలు చేయించుకుంటే.. అనేక వ్యాధుల నుండి సురక్షితంగా ఉంటారు. కాబట్టి 25 సంవత్సరాల వయస్సు తర్వాత ప్రతి సంవత్సరం ఈ 7 టెస్ట్ లు తప్పనిసరిగా చేయించుకోవాలి.



### 1.CBC:

క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ ప్రకారం CBC అంటే పూర్తి రక్త పరీక్ష. ఇందులో రక్తంలో ఏయే విషయాలు పెరిగాయో ఈజీగా తెలిసిపోతుంది. ఉదాహరణకు షుగర్ పెరిగినట్లయితే లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నట్లయితే అది తెలుస్తుంది. ఈ ప్యాకేజీలో KFT అంటే మూత్రపిండాల పనితీరు పరీక్ష, LFT అంటే కాలేయ పనితీరు పరీక్ష చేయబడుతుంది. ఇది మూత్రపిండాలు,కాలేయం ఎలా పని చేస్తుందనే దాని గురించి సమాచారాన్ని అందిస్తుంది. ఈ టెస్ట్ సంవత్సరానికి ఒకసారి చేయించుకోవాలి.

### 2. HIV Test:


వాస్తవానికి ఇప్పుడు మన దేశంలో హెచ్ఐవి కేసులు తగ్గాయి. అయితే సంవత్సరానికి ఒకసారి తప్పనిసరిగా HIV టెస్ట్ చేయించుకోవాలి. ఈ వ్యాధిని ముందుగానే గుర్తిస్తే చాలా తేలికగా నయం చేయవచ్చు.

### 3. వృషణ పరీక్ష(Testicular test):

వృషణ క్యాన్సర్ కేసులు 15 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల పురుషులలో కూడా నమోదవుతున్నాయి. ప్రతి మనిషి సంవత్సరానికి ఒకసారి వృషణ పరీక్ష చేయించుకోవాలి. దీన్ని డాక్టర్ స్వయంగా చేసి వృషణాలను తాకడం ద్వారా ఏదైనా గట్టిదనం లేదా గడ్డ ఉందా అని తెలుసుకుంటారు. వృషణాల క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే 95 శాతం కేసుల్లో అది నయమవుతుంది.

### 6. కోలన్ క్యాన్సర్ టెస్ట్:

25 ఏళ్ల తర్వాత ఒకసారి కోలన్ క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలి. కడుపు సంబంధిత వ్యాధి ఉన్నట్లయితే లేదా మల విసర్జనకు ఇబ్బందిగా ఉంటే ఈ టెస్ట్ లో తెలిసిపోతుంది.



### 7. కంటి పరీక్ష -

25 ఏళ్ల వయస్సు వచ్చిన తర్వాత కంటి పరీక్ష సమయం కూడా వస్తుంది. అందుకే మీ కళ్లను ఒకసారి చెక్ చేసుకోండి. ఈరోజుల్లో చాలామంది చిన్నప్పటి నుంచి కళ్లద్దాలు పెట్టుకుంటున్నా కూడా 25 ఏళ్ల తర్వాత ఒకసారి కళ్లను చెక్ చేసుకోవాలి.



### 4. BP Test:

బీపీ పరీక్ష చేయించుకోవడం చాలా సులభం కానీ చాలా మంది ఈ పరీక్ష చేయించుకోరు. తమకు రక్తపోటు ఉండదని సాధారణంగా చాలామంది అనుకుంటారు. కానీ 25 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా బీపీ టెస్ట్ చేయించుకోవాలి.

### 5. హార్ట్ బీట్ రేటు:

గుండె చాలా వేగంగా లేదా చాలా నెమ్మదిగా కొట్టుకుంటున్నట్లయితే గుండెకు సంబంధించిన ఏదో సమస్య ఉందని అర్థం. అందుచేత గుండె చప్పుడును ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. తక్కువ ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి.

ముందడుగు
శుక్రవారం, 28-6-2024, హైదరాబాద్

# కల్కి 2898 ఏడీ రివ్యూ..

## ప్రభాస్ సైన్స్ ఫిక్షన్ మూవీ ఎలా ఉందంటే?

**సినిమా: కల్కి2898ఏడి**
**తారాగణం: ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపిక పదుకొనే, దిషా పటానీ, రాజేంద్రప్రసాద్, శోభన..**
**దర్శకుడు: నాగ్అశ్విన్**
**నిర్మాత: సి.అశ్వనీదత్**
**నిర్మాణం: వైజయంతీమూవీస్**



పాన్ఇండియా స్టార్‌గా మారాక ప్రభాస్ నుంచి వచ్చిన ఏ సినిమాకీ రానంత హైప్ 'కల్కి 2898ఏడీ'కి వచ్చింది. దర్శకుడిగా నాగ్ అశ్విన్ చేసింది రెండు సినిమాలే అయినా.. రెండూ గొప్ప సినిమాలు కావడం, ప్రతిష్టాత్మక వైజయంతీమూవీస్ నుంచి వస్తున్న సినిమా కావడం, నాగ్అశ్విన్ ఎంచుకున్న కథ కావడం.. అన్నింటినీ మించి అమితాబ్, కమల్ లాంటి ఆలిండియా సూపర్‌స్టార్లు ఇందులో భాగం కావడం.. ఇవన్నీ ఈ సినిమా హైప్‌కి గల కారణాలు కావచ్చు. సినిమా ప్రమోషన్ విషయంలో కూడా వినూత్న పద్ధతుల్ని అనుసరించారు చిత్రయూనిట్. దాంతో సినిమాను ఎప్పుడు థియేటర్లో ఎక్స్‌పీరియన్స్ చేద్దామా? అని ప్రేక్షకులు ఆతృతగా ఎదురుచూశారు. ఆ ప్రభావం వసూళ్లపై తప్పనిసరిగా ఉంటుందని చెప్పొచ్చు. 600కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 800కోట్ల బిజినెస్ చేసింది. మరి అందరి అంచనాలను 'కల్కి 2898ఏడీ' అందుకున్నాడా? ఊహించినట్టే విజువల్ వండర్‌గా సినిమా ఉందా? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే ముందు కథలోకెళ్లాలి.

### కథ

6వేల సంవత్సరాల క్రితం జరిగిన కురుక్షేత్ర సంగ్రామం చివరి అంకం నుంచి ఈ కథ మొదలవుతుంది. బ్రహ్మాస్త్ర ప్రయోగంతో ఉత్తర గర్భాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించాడు అశ్వత్థామ(అమితాబ్). కానీ కృష్ణపరమాత్మ బ్రహ్మాస్త్రానికి అడ్డుపడి అపాండవం జరగకుండా అడ్డుకున్నాడు. ఈ దుశ్చర్యకు పాల్పడ్డ అశ్వత్థామను 'మానని గాయాలతో ఇలా చావులేకుండా పడివుండు' అని శపించాడు. అశ్వత్థామ శాపవిమోచనం అడగ్గా.. 'ఉత్తర గర్భంలోని బిడ్డను చంపడానికి ప్రయత్నించి పాపం మూటగట్టుకున్న నువ్వు.. నా వచ్చే అవతారంలో తల్లి గర్భంలో ఉన్న నన్ను కాపాడి పుణ్యాన్ని మూటగట్టుకుంటావ్.. అప్పుడే నీకు శాపవిమోచనం' అని కృష్ణుడు చెప్పాడు. ఇది జరిగిన ఆరువేల సంవత్సరాల తర్వాత అసలు కథ మొదలైంది. అది 2898వ సంవత్సరం. కలి ప్రభావంతో ప్రపంచం దాదాపుగా నిర్వీర్యమైపోయింది. లక్షలకోట్ల జీవరాసులతో, పంచభూతాత్మకమైన భూమి కళావిహీనం అయ్యింది. వనరులన్నీ నిండుకున్నాయి. నదులన్నీ ఇంకిపోయాయి. ఇక భూమిపై మిగిలింది మూడే ప్రాంతాలు. కాశీ, శంబల, కాంప్లెక్స్. తిరగబడ్డ పిరమిడ్ ఆకృతిలో ఉండే కాంప్లెక్స్.. భూసారాన్నంతటినీ పీల్చి తనలో నిక్షిప్తం చేసుకుంది. దాంతో సకలసౌకర్యాలు, సంపద కాంప్లెక్స్ పరమయ్యాయి. కాంప్లెక్స్ ఆధిపత్యంపై శంబల వాసులు నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నారు.

ఇక కాశీవాసులైతే ఎలాగైనా కాంప్లెక్స్‌లో చోటు కోసం ప్రయత్నిస్తున్నారు. వారిలో భైరవ(ప్రభాస్) ఒకడు. ఎలాగైనా యూనిట్స్(డబ్బు) సంపాదించి, కాంప్లెక్స్‌లో చోటు సంపాదించడం భైరవ లక్ష్యం. దానికోసం తప్పులు కూడా చేస్తుంటాడు. ఇక కాంప్లెక్స్‌ని పాలించే రాజు సుప్రీం యాస్కిన్(కమల్‌హాసన్). భయంకరమైన నరరూపరాక్షసుడు. అతని వయసు 200ఏళ్లు. తన రాజ్యంలో స్త్రీలు గర్భం దాల్చడం నిషిద్ధం. మరోవైపు పరమాత్మ రాకకోసం అశ్వత్థామ కాశీలోని ఓ భూగర్భ దేవాలయంలో ఎదురుచూస్తున్నాడు. అలాంటి పరిస్థితుల్లో తన ప్రమేయం లేకుండా సుమతి(దీపిక పదుకొనే) అనే అమ్మాయి గర్భం దాల్చింది. ఆ గర్భంలో ఉన్నది సాక్షాత్ శ్రీమన్నారాయణుడి అవతారమైన కల్కి. కల్కి గర్భంలోకి ప్రవేశించగానే.. భూమిపై ఊహించని మార్పులు సంభవిస్తుంటాయి. అప్పటికే భూగర్భంలో దొరికిన అర్జునుడి గాండీవం(Arjuna Weapon) యాక్టివేట్ అయ్యింది. పరమాత్మ ఆవిర్భావాన్ని ముందే గమనించిన అశ్వత్థామ జనారణ్యంలోకి అడుగుపెట్టాడు. జరుగుతున్న శకునాలను గమనించిన కాంప్లెక్స్ దానికి కారణమైన సుమతి గర్భస్థశిశువును చంపడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఆ తల్లి గర్భంలోని దేవదేవుడ్ని అశ్వత్థామ కాపాడగలిగాడా? యూనిట్స్ సంపాదించి కాంప్లెక్స్‌లో స్థానం సంపాదించాలనే భైరవ కోరిక నిజమైందా? అసలు 'కల్కి' అవరించాడా? ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.

### విశ్లేషణ

తెలుగు సినిమా చరిత్రలో వచ్చిన వినూత్న ప్రయోగం ఇది. మూడు గంటలపాటు ప్రేక్షకుడికి హాలీవుడ్ సినిమాను చూస్తున్న ఎక్స్‌పీరియన్స్‌ని అందించాడు దర్శకుడు నాగ్అశ్విన్. వందల సంవత్సరాల తర్వాత టెక్నాలజీని తెరపై చూపిస్తూ.. మరోవైపు మన పురాణాల్లోని పాత్రల్ని ఈ కథలో ఇన్వాల్వ్ చేస్తూ ఓ కొత్త అనుభూతిని అందించాడు. 'కల్కి 2898ఏడీ' చూస్తుంటే తెలుగు సినిమా చూస్తున్నంట్టుండదు. హాలీవుడ్ సినిమా చేస్తున్న ఫీలింగే కలుగుతుంది. అంత గొప్ప టెక్నాలజీని ఇందులో చూడొచ్చు. సినిమా చూస్తుంన్నతసేపు 'అవేంజర్స్', 'అవతార్ 'టెర్మినేటర్' సినిమాలు గుర్తొస్తాయి. ఆ స్థాయి సాంకేతికత ఇందులో చూడొచ్చు. అయితే.. హాలీవుడ్ సినిమాను ప్రేరణగా తీసుకొని భారతీయ సినిమా తీయడం తప్పకాదు. భారతీయ కథతో హాలీవుడ్ సినిమా తీయడం తప్ప. అలా చేయాలన్నా సంస్కృతి సహకరించదు. 'కల్కి' సినిమా విషయంలో అదే జరిగింది. పైగా ఈ కథ రెండు భాగాలుగా చెప్పేది కాదనేది పలువురి అభిప్రాయం. కేవలం రెండు భాగాలుగా చేయడానికే అవసరంలేని కథనాన్ని, అసంబద్ధమైన సన్నివేశాలను చొప్పించారని పలువురు అభిప్రయపడుతున్నారు. దీనివల్ల సినిమా కాస్త ల్యాగ్ అనిపిస్తుంది. ముఖ్యంగా ప్రథమార్ధమంతా హాలీవుడ్ తరహా భారీతనాన్ని చూపించుకోడానికే సరిపోయింది. దానికితోడు భైరవ కామెడీ సీన్స్ పంటికింద రాళ్లులా అనిపిస్తాయి. కాశీ, శంబల, కాంప్లెక్స్ సినేరియా, యూనిట్స్ కోసం హీరో సాహసాలు, అర్థంలేని కామెడీ సీన్స్.. ప్రథమార్థం మొత్తం ఇదే. ఇక ద్వితీయార్థం అసలు కథలోకెళ్తాం. దీపిక పదుకొనే నటించిన సుమతి పాత్ర గర్భవతి అయినప్పట్నుంచి, ఆ బిడ్డను కాపాడటానికి అశ్వత్థామ చేసే పోరాటాలు, సుమతిని కాంప్లెక్స్ అప్పజెప్పి ఎలాగైనా డబ్బు గడించాలనే భైరవ ప్రయత్నాలు.. ఇవన్నీ ఇంట్రస్‌ట్‌గా అనిపిస్తాయి. ఈ నేపథ్యంలో వచ్చే పోరాటాలు హాలీవుడ్ సినిమాలకు ఏ మాత్రం తగ్గవ్. ఈ కథనంలో మరో విశేషం ఏంటంటే.. ప్రభాస్ పోషించిన భైరవ పాత్రను కర్ణుడి అవతారంగా చూపించాడు నాగ్అశ్విన్. ఈ విషయాన్ని చివర్లో రివీల్ చేశాడు. కర్ణుడు కురుసామ్రాజ్యంలో స్థానంకోసం ఎలాగైతే తాపత్రయపడ్డాడో, ఇందులో భైరవ కూడా కాంప్లెక్స్‌లో స్థానం కోసం తాపత్రయపడుతూ ఉంటాడు. అందుకోసం కర్ణుడి మాదిరిగా తప్పులు కూడా చేస్తుంటాడు. ఇదంతా సింబాలిక్‌గా చూపించాడని చెప్పొచ్చు. అయితే.. కల్కి ఆగమనాన్ని, ఆయన చేసే దుష్టసంహారాన్ని చూడటానికి థియేటర్లలోకి వచ్చే ప్రేక్షకులకు ఈ సినిమా నిరాశనే మిగుల్చుతుంది. ఇప్పటివరకూ చూసింది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది అని చెప్పేలా సినిమా సాగింది. కల్కి జననం.. పోరాటం అంతా రెండో పార్ట్‌లోనే అని చెప్పకనే చెప్పాడు దర్శకుడు నాగ్అశ్విన్. ముఖ్యంగాక్లైమాక్స్ సూపర్. దైవశక్తితో కూడిన ఓ ద్రవాన్ని శరీరంలోకి తీసుకున్న యాస్కిన్ అతిబలవంతుడుగా అవతరించడం, పరమాత్మను గర్భంలో మోస్తున్న సుమతి.. యాస్కిన్ మనుషులకు దొరికిపోవడంతో ఫస్ట్‌పార్ట్‌ని ముగించాడు.

### నటీనటుల నటన

ఇందులో నటించిన వారంతా ఉద్దండులే. అమితాబ్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపిక, శోభన, రాజేంద్రప్రసాద్.. వీరి నటన గురించి ప్రత్యేకించి చెప్పకునేదేముంది!.. అందరూ అద్భుతంగా నటించారు. కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడిగా కనిపించి అందరినీ షాక్‌కి గురిచేశాడు రౌడీ హీరో విజయ్ దేవరకొండ. లెజెండ్రీ దర్శకులు రామ్‌గోపాల్‌వర్మ, రాజమౌళి కూడా చెరో సన్నివేశంలో తళుక్కున మెరిసి మాయమయ్యారు. దుల్కర్ సల్మాన్, మృణాళ్‌ఠాకూర్, ఫరియా అబ్దుల్లా ప్రత్యేక పాత్రల్లో కనిపించారు.

### సాంకేతికంగా

ఇదో టెక్నికల్ మాయాజాలం. తెలుగు సినిమా స్థాయిని మరోస్థాయిలో నిలబెట్టేలా ఉంది ఇందులోని టెక్నికల్ వర్క్. పాటలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కెమెరా విజువల్స్ సూపర్. సంతోశ్ నారాయణన్ బ్యాగ్రౌండ్ స్కోర్ అద్భుతం. రాజీ అనే పదానికి తావివ్వకుండా అత్యున్నత సాంకేతిక విలువలతో సినిమాను నిర్మించారు సి.అశ్వనీదత్. ఈ సినిమా పుణ్యమా.. తెరపై ఓ కొత్తలోకాన్ని ప్రేక్షకులు చూడొచ్చు. వైవిధ్యమైన చిత్రాలను ఇష్టపడే ప్రేక్షకులకు 'కల్కి 2898 ఏడీ' తప్పకుండా నచ్చుతుంది.



# రాగాల వేటలో రాజాసాబ్

దేశం మొత్తం ప్రస్తుతం 'కల్కి 2898ఏడీ' ఫీవర్‌తో ఉంది. ఎక్కడ విన్నా 'కల్కి' టాపిక్కే. వాతావరణం చూస్తుంటే ప్రభాస్ భారీ విజయాన్నే సొంతం చేసుకున్నట్టు కనిపిస్తున్నది. దీని ప్రభావం ప్రభాస్ తర్వాత సినిమాపై కచ్చితంగా ఉంటుంది. 'కల్కి 2898 ఏడీ' తర్వాత వచ్చే ప్రభాస్ సినిమా 'రాజాసాబ్'. దర్శకుడు మారుతీకి ఇది నిజంగా అగ్నిపరీక్షే. కానీ.. మారుతీ కూల్‌గా చెన్నయ్ మెరీనా బీచ్‌లో సంగీత దర్శకుడు తమన్‌తో కలిసి 'రాజాసాబ్' బాణీల కూర్పులో తలమునకలై ఉన్నారు. ఇందులో మొత్తం అయిదు పాటలు ఉండగా, ఇప్పటికే మూడు పాటలకు ట్యూన్స్ ఇచ్చేశాడు తమన్. ఇంకా రెండు పాటలే మిగిలివున్నాయి.

ప్రస్తుతం ఆ ట్యూన్స్ రాబట్టే పనిలో ఉన్నారు తమన్, మారుతి. 'బాహుబలి' ఫ్రాంచైజీ తర్వాత వందలకోట్ల బడ్జెట్‌తో పాన్ ఇండియా సినిమాలు మాత్రమే చేస్తూ వస్తున్న ప్రభాస్.. కాస్త విరామం తర్వాత పూర్తిస్థాయి తెలుగు హారర్ కామెడీతో 'రాజాసాబ్' చేస్తున్నారు. ఈ సినిమాను తొలుత వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలనుకున్నారు. కానీ.. ఇంకా తీయాల్సిన షూటింగ్ చాలా ఉండటంతో వచ్చే ఏడాది సమ్మర్‌లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్న విషయం తెలిసిందే.